
కుటుంబాల్లో గొలుసు చిచ్చు!

● విచ్చలవిడిగా వెలిసిన దుకాణాలతో మహిళల ఆవేదన



గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. విరివిగా మద్యం అందుబాటులోనే దొరుకుతుండటంతో అలవాటు పడిన వ్యక్తుల కుటుంబాల్లో నిత్యం గొడవలు చోటుచేసుకుంటున్నాయి. కొంత మంది వ్యసనానిక లోనై ఆరోగ్యం క్షీణించి మృత్యువాత పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇటీవల కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామానికి చెందిన మహిళలు సంఘటితమై వీటితో మా సంసారాలు గుల్లవుతున్నాయని మూసివేయించాలని రోడ్డెక్కడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది.



న్యూస్‌టుడే, కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ గ్రామీణం

జిల్లాలో అనుమతి పొందిన మద్యం దుకాణాలు 38 వరకు ఉండగా, గొలుసు దుకాణాలు సుమారు వెయ్యికి పైనే. కిరాణ దుకాణాల మాటున, ప్రధాన రహదారులను ఆనుకుని వీటిని దర్జాగానే కొనసాగిస్తున్నారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికొచ్చిన కూలీలు, రైతులు, అందుబాటులోని దుకాణాలకు వెళ్తండగా విద్యార్థులు అలవాటుపడుతున్నారు. సంబంధిత ఆబ్కారీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బహిరంగంగానే తరలిస్తూ..

కాగజ్‌నగర్‌లోని గల్లి గల్లిలోనూ గొలుసు దుకాణాలు పదుల సంఖ్యలో వెలిశాయి. తీరందాజ్‌బస్తీ ఏరియాలో 24 గంటల పాటు విక్రయాలు కొనసాగుతున్నాయి. నిషేధిత రోజుల్లోనూ మద్యం వ్యాపారులే గొలుసు దుకాణాలకు సరఫరా చేసి మద్యం ప్రియులకు ఎలాంటి లోటు లేకుండా విక్రయాలు జరుపుతున్నారు. పట్టణంలోని వైన్‌షాపులు రాత్రి 10 గంటలకు మూసివేస్తుండగా.. గొలుసు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియులకు నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు. పట్టణ, మండలంలోని మద్యం వ్యాపారులు గొలుసు దుకాణాలను పంపకాలు చేసుకుని సరఫరా చేస్తూ అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు. ద్విచక్రవాహనాలపై బహిరంగంగా నిర్వాహకులే దుకాణాలను మద్యం తరలిస్తున్నారు.

భరించలేకపోతున్నాం

- లెండుగురె అరుణ, కోసిని



మా గ్రామానికి సమీపంలోనే గొలుసు దుకాణం ఉంది. అరువుపై కూడా మద్యం ఇస్తుండటంతో కొంత మంది నిత్యం మత్తులో తూగుతున్నారు. రాత్రి వేళల్లో వీధుల వెంబడి తాగుబోతుల చేష్టలు భరించలేకున్నాం. ఈ దుకాణాల కారణంగా సంసారాల్లో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. తండ్రులు తాగి వస్తున్నందున పిల్లలు సైతం అనుకరిస్తున్నారు. భర్తల ఆగడాలను భరించలేక పలువురు మహిళలు పుట్టినిళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటిని వెంటనే మూసివేయాలి.





కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారి రాంనగర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వెలిసిన మద్యం గొలుసు దుకాణాలు ఇవి. కోసిని గ్రామానికి కేవలం అర కిలోమీటరు దూరంలో ఉన్నాయి. మద్యం ప్రియులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే మకాం వేస్తుండటంతో ఈ మార్గంలో వెళ్లలేకపోతున్నట్లు మహిళలు వాపోతున్నారు. వీరి ఆందోళనల ఫలితంగా ఈ దుకాణాలు ప్రస్తుతానికి మూతపడ్డాయి. కాగా నిర్వాహకులు ఇళ్లల్లోనే విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ఇది కాగజ్‌నగర్-పెంచికల్‌పేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న గొలుసు దుకాణంలో మద్యం తాగుతున్న యువకుడు. ఇక్కడి హోటళ్లు వీటికి అడ్డాగా మారాయి. ఈ మార్గానికి ఇరువైపులా హోటళ్లు, కిరాణ దుకాణాల్లో విచ్చలవిడిగా మద్యం లభిస్తుండడంతో.. నిత్యం సాయంత్రం వేళల్లో మద్యంప్రియుల సందడి కనిపిస్తోంది.

ప్రజలకు అందుబాటులో ఉండండి

కెరమెరి, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో ఈ నెల 17న జరగనున్న కుమురం భీం వర్ధంతి నేపథ్యంలో హట్టి నుంచి జోడేఘాట్ వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని జోడేఘాట్ వెళ్లే మార్గంలో హట్టి సమీపంలో రోడ్డును పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి తాగునీరు, మురుగు వంటి తదితర పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఎంపీడీవో అబ్దుత్‌పాషా, ఏపీవో మల్లయ్య, సిబ్బంది వెంట ఉన్నారు.

ఏమాత్రం పట్టదా..


ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షణ గాడి తప్పుతోంది. ఎందరు వైద్యులు ఉన్నారు, ఎవరి విధులు ఎప్పుడు నిర్వహిస్తున్నారన్న వివరాలేమీ.. రోజువారీగా బోర్డులపై రాయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతే కాకుండా మందులు లేవని బయట కొనుక్కోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. పేద కుటుంబాల రోగులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని మందులు అందుబాటులో ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో చెబుతున్న వైద్యాధికారులు. రోగులు వెళితే మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రశ్నిస్తే ఎవరికి చెబుతారో చెప్పుకోండని తెగించి మాట్లాడుతుండటం విస్మయానికి గురిచేస్తోంది. బుధవారం ఓ రోగిని మందులు బయటి నుంచి తెచ్చుకోవాలని విధులో ఉన్న ఉన్న వైద్యుడు చెప్పడంతో.. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చాడు. సదరు వైద్యుడిని వెళ్లి పేరు అడిగితే.. బయట బోర్డుపై ఉంటుంది చూసుకోమని చెప్పడం విధుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.





బయట కొని తెచ్చినట్లు చూపుతున్న సూదిమందు, మాత్రలు



మందులు లేవని జాబితా రూపొందించి అంటించారిలా..

ఆర్థిక ఇబ్బందులు..

జిల్లా కేంద్రంలోని సామాజిక ఆసుపత్రి.. ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడంతో దాని పరిధిలోకి వెళ్లింది. ఇక్కడ తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులు, వైద్య కళాశాలకు చెందిన వైద్య బోధకులు చికిత్సలు అందిస్తున్నారు. ఎవరు ఎప్పుడు వస్తున్నారు, ఎవరు ఏ రోగాలకు సంబంధించిన వైద్య నిపుణులనే విషయం తెలియని పరిస్థితి. కొన్ని నెలలుగా వివిధ రకాల మందులు అందుబాటులో లేక రోగులు బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. అలర్జీకి ఇచ్చే ఏవిల్ సూది మందు, నొప్పులకు ఇచ్చే డైక్లోఫెనాక్ సూదిమందు, గొంతునొప్పికి సంబంధించిన అజిత్రోమైసిన్, జ్వరం, ఒళ్లు నొప్పులకు వేసుకునే డోలో-650 ఎంజీ, చిన్నారులకు సంబంధించిన 24 నంబర్ క్యాన్‌వలా, కొన్ని యాంటిబయాటిక్ మందులు... ఇలా అనేక రకాల మందుల కొరత ఉంది. ఇవి ఉమ్మడి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి రావడం లేదని వైద్యులు చెబుతున్నారు. దీంతో రోగులకు బయటి మందులు రాయాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగుల కుటుంబాలు మాత్రలు, సూది మందులను బయట కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు. డయాలిసిస్ కేంద్రంలోనూ కిడ్నీ రోగులకు రక్తం పెంపుకోసం ఇచ్చే సూది మందు లేక బయటకు కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయట కొనుక్కోమన్నారు..

- కోట శర్మ, అప్పపెల్లి, బాధితుడు


మాది ఆసిఫాబాద్ మండలం అప్పపెల్లి. మా నాన్నకు అలర్జీ కావడంతో ఆసుపత్రికి తీసుకొచ్చా. మందులు లేవని బయట తీసుకోవాలని రాశారు. మాత్రలు, సూదిమందు కొనుగోలు చేసి తెచ్చుకున్నా. రోగుల పట్ల వైద్యులు సైతం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు.

భాషపై పట్టు.. మార్కులు కొట్టు

దండేపల్లి, న్యూస్‌టుడే


● తప్పులు లేకుండా రాయడం.. వ్యాకరణ అంశాలపై అవగాహన అవసరం

పదో తరగతి పరీక్షలకు మరో అయిదు నెలల సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. చాలా మంది విద్యార్థులు ఆప్షనల్ సబ్జెక్టులను బాగా సాధన చేస్తూ భాష విషయాలను పట్టించుకోరు. దీంతో జీపీఏ తగ్గే అవకాశముంది. మంచి జీపీఏ సాధించాలంటే అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలి. ఈ నేపథ్యంలో తెలుగు, హిందీ, ఆంగ్లం ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...



వ్యాకరణం.. పద్యసాధనతో ఉత్తమ ఫలితం

తెలుగు..



చుక్క గుర్తు పెట్టిన పద్యాలు రాసి వాటి భావాలు, ప్రతిపదార్థం, కవి పరిచయం, రచనాశైలిపై అవగాహన పెంచుకోవాలి. పాదభంగం లేకుండా పద్యం పూరించి భావం రాస్తే ఐదు మార్కులు ఖాయం.

- పద్య, గద్య ఉపవాచకాల నుంచి 6 వ్యాస రూప ప్రశ్నలుంటాయి. ఛాయిస్ పోనూ మూడింటికి సమాధానం రాస్తే 21 మార్కులు వస్తాయి. కథానిక, కథ, కవిత, గేయం, పాట, ఆహ్వానపత్రం, ముఖాముఖి ప్రశ్నావళి, అభినందన పత్రం, నాటకం, నాటిక, సంభాషణ, ప్రకటనలు, కరపత్రం తయారు చేయడంపై పట్టు సాధిస్తే ఏడు మార్కులు సాధిస్తారు..
- పదజాలం, సంధులు, సమాసాలు, అలంకారాలు, గణవిభజన, వాక్యాలను సాధన చేయాలి.
- పద్య భాగంలోని భిక్ష, దానశీలం, శతక మధురిమ పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశముంది.
- అపరిచిత (పుస్తకంలో లేనిది) పద్యం, గద్యం ఇచ్చి దీని కిందనే ప్రశ్నలు ఉంటాయి. వీటిని అవగాహన చేసుకుని జవాబులు రాస్తే పది మార్కులు వస్తాయి.
- తెలుగులో దస్తూరి బాగుండటంతో పాటు అక్షర దోషాలు లేకుండా రాయగలగాలి.



బి.హరిచరణ్, తెలుగు భాషోపాధ్యాయుడు, ఉన్నత పాఠశాల తేజాపూర్, ఆదిలాబాద్ జిల్లా

భాషపై అవగాహన ముఖ్యం

హిందీ..

పఠిత, అపఠిత గద్యాంశాలు, పద్యాంశాలు నేర్చుకుంటే 20 మార్కులు వస్తాయి. వ్యాకరణంలో భాషాభాగాలు, వ్యతిరేక పదాలు, సమానార్థాలు, వచన్, ఉపసర్గ్, ప్రత్యయ్, పునరుక్తి శబ్దాలు, మహావరాల నుంచి 20 మార్కులు. పద్య, గద్య భాగాలలోని ముఖ్యమైన పాఠ్యాంశాల సారాంశాలను సొంత మాటల్లో రాసేలా అభ్యాసం చేయాలి. ఉపవాచకంలోని గద్యాంశాలపై దృష్టి పెడితే మంచి మార్కులు వస్తాయి. ప్రతి పాఠంలోని కవి పరిచయాల సాధన తప్పనిసరి.

- పాదభంగం లేకుండా చూడాలి. డైరీ, పోస్టర్, సంవాదం, సూచన, లేఖలు, కరపత్రం తయారీ, నిబంధ్ పై సాధన చేయాలి.



కె.వామన్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు, జైనూర్ ఉన్నత పాఠశాల కుమురం భీం జిల్లా

పదజాలంపై పై దృష్టి సారించాలి

ఆంగ్లం..



ప్రశ్నపత్రం పార్ట్ ఏ, బీ విభాగాలుగా ఉంటుంది. 'ఏ'లో రెండు మైనర్ డిస్కోర్స్‌లు, ఒక మేజర్ డిస్కోర్స్ ఉంటాయి. మైనర్‌లో మెసేజ్‌లు, డైరీ, నోటీస్‌లు, పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్ ఉంటాయి. వీటిని సాధన చేస్తే పది మార్కులు వస్తాయి. మేజర్‌లో లేఖలు, బయోగ్రఫీ, కొరియోగ్రఫీ, కన్వర్సేషన్, న్యూస్ రిపోర్ట్, ఇంటర్వ్యూ, తదితర అంశాలు ఉంటాయి. వీటిని సాధన చేస్తే 10 మార్కులు.. అంటే మొత్తం కలిపి 20 మార్కులు వచ్చినట్టే. అదే విధంగా రెండు ప్యాసేజీలు ఉంటాయి. వీటిని చదివి ప్రశ్నలకు జవాబులు రాస్తే 24 మార్కులతో మొత్తం పార్ట్ ఏలో 60 మార్కులుంటాయి.

- పార్ట్ బిలో వ్యాకరణం, ఎడిటింగ్, తప్పులను సవరించడం (కరెక్టింగ్ ఎర్రర్స్), పద్యం చదివి ప్రశ్నలకు సమాధానాలు రాస్తే పది మార్కులు సాధించవచ్చు. పుస్తకంలో లేని ప్యాసేజీ ఇచ్చి దీనిని చదివి మల్టీపుల్ ఛాయిస్‌లో ప్రశ్నలుంటాయి. వీటికి 20 మార్కులుంటాయి.
- వ్యాకరణం, తప్పులు లేకుండా రాయడం, ప్యాసేజీలు అవగాహన చేసుకుని జవాబులు రాస్తే మంచి జీపీఏ సాధించవచ్చు.



రమాబిందు, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, వెల్గనూర్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల జిల్లా

ధ్రువపత్రాల పరిశీలనకు నేడు ఆఖరు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో డీఎస్సీ-2024 లో 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం చివరి రోజని జిల్లా విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 3వ తేదీ నుంచి ధ్రువ పత్రాల పరిశీలన కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు పరిశీలనకు రాని వారు సాయంత్రం 5 గంటల లోపు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ ప్రారంభం

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో మంచినీటి సహాయకులు (ఎంపీడబ్ల్యూలకు) నాలుగు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ఎంపీడీవో మల్లేష్ ప్రారంభించారు. పంచాయతీ నుంచి ఒకరి చొప్పున ఎంపిక చేశారు. మొదటిరోజు పైప్‌లైన్ లీకేజీ, కొత్త కనెక్షన్ అనుసంధానించే విధానం, లీకేజీ మరమ్మతులు చేయడంపై మిషన్ భగీరథ ఏఈ కృష్ణతేజ వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



ఎస్పీఎం క్రికెట్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ పట్టణంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పూర్తిస్థాయిలో వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మకు ఎస్పీఎం క్రికెట్ మైదానం, కోయవాగు, దసరా పండగ శమీపూజకు త్రిశూల్‌పహాడ్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 10న సద్దుల బతుకమ్మ, 12న శమీపూజ రావణ దహనం పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పురపాలిక కమిషనర్ అంజయ్య, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దస్తగిరి, భాజపా నాయకుడు కొంగ సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, అరుణ్‌లోయా, అశోక్‌లోయా, మనోహర్ గౌడ్, తిరుపతిగౌడ్, నూనె సంపత్‌కుమార్, దీపక్, పవన్‌బల్దేవా, దీపక్, శివప్రసాద్, ఎస్పీఎం ప్రతినిధులు, తదితరులు వారి వెంట ఉన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

అవసరమైతే అదనపు కొనుగోలు కేంద్రాలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావులతో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు, డిజిటల్ మైక్రో మీటర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, నీడ, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలతో పాటు అవసరమైతే మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం వడ్లు రాకుండా సరిహద్దు మండలాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి పటిష్ఠ భద్రత చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొన్నాక వెంటనే ట్యాగింగ్ చేసిన రైసు మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాల వద్ద ధరలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ మద్దతు ధరకు సేకరించాలన్నారు. విక్రయించే ధాన్యం నాణ్యతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, ఐకేపీ, కార్మిక, రవాణా, బ్యాంకు శాఖల అధికారులు, రైసు మిల్లర్లు పాల్గొన్నారు.

17న జోడేఘాట్‌లో కుమురంభీం వర్ధంతి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 17న కుమురంభీం వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆదివాసీ సంఘాలతో కలసి భీం వర్ధంతికి సంబంధించిన గోడప్రతులు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సంక్షేమ కోసం అలుపెరగని పోరాటం చేసిన కుమురంభీం వర్ధంతికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శాఖలకు కేటాయించిన పనులను సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పత్తి పంటలో మానసిక ఒత్తిడి

ఆధునిక సమాజంలో మనిషి ఎదుగుదలతో పాటు మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దాన్ని అధిగమిస్తే తప్ప నిలదొక్కుకోవటం కష్టమవుతోంది. ఇది మనుషులకే కాదు చేలోని పంటల్లోనూ కనిపిస్తోంది. ప్రధానంగా 45 రోజుల దశకు చేరుకునే పత్తి పంటలోనూ మానసిక ఒత్తిడి పెరుగుతోంది. పసిగట్టి నివారించాల్సి వైద్యుడు రైతే. పత్తి పంటకు మానసిక ఒత్తిడా? అనేది నమ్మశక్యంగా లేదు. కానీ నమ్మితీరాల్సిందే అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. ఇంతకీ పత్తి పంటలోని మానసిక ఒత్తిడికి కారణాలేమిటి? నివారణ ఏమిటి? అనేదానిపై ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.రాంప్రసాద్‌తో 'ఈటీవీ-ఈనాడు' ప్రత్యేక ముఖాముఖి.






కుంగుబాటుకు గురైన పత్తిని చూపిస్తున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

● వాతావరణ సమతుల్యత లోపమే ప్రధాన కారణం

వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తతో 'ఈటీవీ-ఈనాడు'



ఈటీవీ – ఆదిలాబాద్

ఈ : సహజంగా మనిషిలో ఉండే మానసిక ఒత్తిడి పత్తి పంటలోనూ ఉంటుందనేది కొత్తగా వినిపిస్తోంది. నిజమేనా? దానికి కారణాలేమిటి?

రాంప్రసాద్ : ముమ్మాటికీ నిజమే. ప్రాణమున్న అన్ని జీవుల మాదిరిగా పంటల్లోనూ మానసిక ఒత్తిడి ఉంటుంది. ప్రధానంగా పత్తిలో స్పష్టంగా కనిపిస్తోంది. యవ్వన, వృద్ధాప్య దశలో వివిధ సమస్యలతో బాధపడే మనుషుల్లో కుంగుబాటుకు గురైనట్లే పత్తిపంట 40 రోజుల దశదాటిన తర్వాత రెండు రకాల ఒత్తిళ్లకు గురవుతుంది. అందులో మొదటిది అధిక వర్షపాతంతో ఊపిరాడకుండా గురయ్యే ఒత్తిడైతే, నీటి ఎద్దడి కారణంగా పోషకాలు లభించకుండా కుంగుబాటుకు గురయ్యే ఒత్తిడి రెండోది.

ఈ : మనుషులైతే తమ బాధలు, సమస్యలను వైద్యులకో, స్నేహితులకో వివరించి ఉపశమనం పొందవచ్చు. పత్తి పంట తన బాధను ఎలా వివరిస్తుంది. మనం ఎలా పసిగట్టవచ్చు?

రాం : మీరనేది నిజమే! మనుషులు తమ బాధలను మాటల ద్వారా వెల్లడిస్తారు. కుంగుబాటుకు గురయ్యే పత్తి పంట కూడా నేను ఒత్తిడిలో ఉన్నానని సాగుచేసే రైతులకు పెరుగుదల రూపంలో సంకేతం ఇస్తుంది. అదెలాగంటే నీరు ఎక్కువైనా, తక్కువైనా ఏపుగా పెరిగిన మొక్కలు సాయంత్రం తర్వాత మోడువారినట్లు కనిపిస్తాయి. గాలివీచినా కదిలినట్లుగా అనిపించవు. ఆకులు తలవాల్చి వడలిపోయినట్లు ఉంటాయి. క్రమంగా పూత, కాత రాలిపోతుంది. జీవంలేని మొక్కలుగా మారుతాయి. ఇవన్నీ ఇతరులకు తెలియకపోవచ్చు. రైతులకు తెలిసిన అంశాలే.

ఈ : కుంగుబాటుకు గురైన పత్తి పంటను ఎలా కాపాడుకోవచ్చు?

రాం : వ్యవసాయం చేసే ప్రతి రైతు పంటల యోగక్షేమాలను గుర్తించగలిగే వైద్యుడే. పత్తి పంటనే కాదు. ఏ పంటలో ఏ మార్పు వచ్చిందో? ఏం చేయాలో? ఎలా రక్షించుకోవాలో తెలిసిన జ్ఞానే. మేం చెప్పే సూచనల ప్రకారమైతే చేలోని పంటలకు అధిక నీటి నిల్వతో ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. కాస్తంత తడి ఉండేలా చూసి ప్రతి 20 రోజులకోసారి ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్‌ను మొక్క నేలభాగంలో వేయాలి. పూత, కాత రాలకుండా 10 రోజులకోసారి 13-0-45(పొటాషియం నైట్రేట్) పొడిని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున తెగుళ్ళు, పురుగు మందులతో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయటం ద్వారా పంటలను మానసిక ఒత్తిళ్ల నుంచి కాపాడుకోవటానికి దోహదం చేస్తుంది.

ఈ : ఇప్పుడున్న పంటల పరిస్థితి ఎలా ఉంది? మొక్కలు ఒత్తిళ్లకు గురికాకుండా రైతుకు దిగుబడులు తగ్గకుండా ఏం చేయాలి?

రాం : పత్తి పంట అంటే పసికందును సాకినట్లే. ప్రస్తుతం 90 రోజుల దశలో ఉన్న పంటను 140 రోజుల వరకు కాపాడుకోవాల్సిందే. మొక్కలు కుంగుబాటుకు గురికాకుండా క్రమం తప్పకుండా పోషకాలు అందిస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చు. మరో 10, 15 రోజుల్లో ఒకటి, రెండు వర్షాలు కురిస్తే బాగుంటుంది.

విహంగాల అందం.. అడవితో అనుబంధం


మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలో పక్షులను వీక్షిస్తున్న అధికారులు


ఆకట్టుకునే అందం వెంగన్న చెరువు సొంతం


జపం చేస్తున్నట్లు..


దీర్ఘాలోచనలో..


రామచక్కని చిలుకలు




కొనితెచ్చి పెట్టిన బొమ్మ కాదండోయ్.. నల్దుర్తి అడవిలో కనిపించిన పక్షి


ఆకాశంలో విహరిస్తూ..


దసరాకు ముందే పాలపిట్ట వచ్చేసింది

అటవీశాఖ ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆ శాఖ అధికారులు మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలోని రెండు పురాతన చెరువుల పరిధిలో పర్యటించారు. అధునాతన కెమెరాలతో పక్షులను వీక్షించారు. ఆ అటవీ ప్రాంతంలోని తుర్కం, వెంగన్న చెరువు ప్రాంతాలకు వలస వచ్చే పలు రకాల పక్షులు, ఆవరణ వ్యవస్థలో వాటి పాత్ర వంటి వాటిపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు కెమెరాలో బంధించిన చిత్రాలను చూస్తే మన దగ్గర ఇంత అందమైన పక్షులున్నాయా? అని ఆశ్చర్యపోతాం. అటవీ క్షేత్రాధికారులు రామకృష్ణ, శ్రీనివాస్‌రావు, వేణు గోపాల్, ఉప అటవీ క్షేత్రాధికారి నజీర్‌ఖాన్, మామడ, దిమ్మదుర్తి రేంజ్‌ల సిబ్బంది ఉన్నారు.
- న్యూస్‌టుడే, మామడ

పసిపాప ఆకలి తీర్చేందుకు
6 కిలోమీటర్ల కాలినడక


● బేల మండలంలో దయనీయ పరిస్థితి..


పసిపాపకు డబ్బా పాలు తాగిస్తున్న కొడప మోతుబాయి


సాంగ్వి నుంచి పాల డబ్బాను తీసుకొస్తున్న అమ్మమ్మ కొడప లచ్చుబాయి

పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించుకునేందుకు అమ్మమ్మ, అమ్మమ్మ అత్తయ్యలు పడరాని పాట్లు పడుతున్నారు. పసిపాప ఆకలి తీర్చేందుకు పాల డబ్బా కోసం గూడెం నుంచి రానుపోనూ 6 కి.మీ దూరం ప్రయాణిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడ పంచాయతీ టెంబిరిగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయికి ఆగస్టు 20న సొంత గ్రామంలో ప్రసవమైంది. ఆడపిల్లకు జన్మనిచ్చింది. సెప్టెంబరు 10న అనారోగ్యానికి గురికావడంతో భర్త దేశ్‌ముఖ్ లస్మ, గ్రామస్థులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మారుబాయి సెప్టెంబరు 13న మృతి చెందినట్లు భర్త తెలిపారు. హైదరాబాద్ నుంచి రూ.12 వేలు ఖర్చు చేసి శవాన్ని తీసుకొచ్చామని, అదే రోజు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారని అన్నారు. భార్య మృతి విషయం తెలిసిన అభిమన్యూ వాట్సాప్ గ్రుపు నిర్వాహకుడు మెస్రం శేఖర్‌బాబు పాప పాల కోసం రూ.30 వేలు అందజేశారు. మూడు రోజులకు ఒకసారి రూ.280 పాల డబ్బా కొనుగోలు చేసి పాలు తాగిస్తూ పాపను బతికించుకుంటున్నామని అమ్మమ్మ లచ్చుబాయి అన్నారు. పాప పాల డబ్బా కోసం టెంబిరిగూడ నుంచి సాంగ్వి వరకు మూడు రోజులకు ఒకసారి రానుపోనూ 6 కి.మీ దూరం కాలినడకన వాగు దాటి వెళ్తున్నామని అన్నారు. పాల డబ్బా కోసం వెళ్లిన సమయంలో వచ్చే వరకు తన అత్తమ్మ కొడప మోతుబాయి ఆలనాపాలనా చూసుకుంటోందన్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి పాలిచ్చే ఆవును ఇస్తే పాప కష్టాలు తీరుతాయని వృద్ధులు వేడుకుంటున్నారు.
- న్యూస్‌టుడే - ఇంద్రవెల్లి, బేల

బ్రహ్మచారిణి రూపంలో బాసర అమ్మవారి దర్శనం



ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర అమ్మవారి ఆలయంలో రెండు రోజుల కిందట ప్రారంభమైన దసరా నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. రెండో రోజు బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో దీక్షలు తీసుకున్న వారందరూ మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేశారు.

గంగనీళ్ల జాతరకు ఏర్పాట్లు పూర్తి

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: ఏటా మహాలయ అమావాస్య తర్వాత వచ్చే శని, ఆదివారాల్లో నిర్వహించే గంగనీళ్ల జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సారంగాపూర్ మండలంలోని అడెల్లిలో కొలువైన పోచమ్మ తల్లి నగలను శనివారం దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి గ్రామానికి చేర్చిన భక్తులు బంధం పోచమ్మ ఆలయ ప్రాంగణంలో జాగరణ చేస్తారు. ఆదివారం గోదావరి నదిలో అమ్మవారి నగలను శుద్ధిచేసి దిలావర్‌పూర్ మండలం మీదుగా అడెల్లి బయలుదేరుతారు. అమ్మవారి నగలకు బండారు పూసి కొత్త చీర కట్టి ముక్కులు చెల్లించుకోవడానికి ఆశేష భక్తజనం వస్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై సందీప్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూల పరిమళం.. ఆరోగ్యదాయకం

● బతుకమ్మలో దాగున్న శాస్త్రీయత





బతుకమ్మ పూలు ఇవే..
ఈ సీజన్‌లో బంతి, చామంతి, తామర, అల్లి, గడ్డిపువ్వు, వామపువ్వు, కట్ల, టేకు, స్వస్తిక్, సీతజడలు, మందార, తంగేడు, బీర, కాకర, గునుగు, గుమ్మడి, దోస, తదితర పూలు వికసిస్తాయి.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం: ప్రకృతి ప్రసాదించిన బతుకమ్మ పండగలో చిన్నారులు, యువతులు, మహిళలు భాగస్వాములవుతారు. తొమ్మిది రోజులు ఆడిపాడుతూ బతుకమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ క్రమంలో పూల నుంచి వెలువడే సువాసనలు, వాటి స్పర్శ మహిళల ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఉత్సవంలో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం దాగి ఉందని శాస్త్రీయంగా రుజువైన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

చామంతి

చామంతి పూలతో చర్మ సమస్యలు దూరమవుతాయి. జ్వరం, కీళ్ల నొప్పులు తగ్గడానికి దోహదం చేస్తాయి. నిద్రలేమి, ఒత్తిడిని తగ్గిస్తాయి.

బంతిపూలు

బంతిపూల సుగంధ వాసన జలుబు నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. కడుపులోని నులి పురుగుల వ్యాధి నివారణకు వాడతారు. ఈ పూల తైలం రక్తస్రావం తగ్గడానికి, కేశాలు పెరగడానికి ఔషధంగా ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు.

కాకర పూలు

కాకర కాయ, వాటి పూలు మధుమేహ వ్యాధిగ్రస్థులకు దివ్యౌషధంగా పని చేయడమే కాకుండా వారి మానసిక స్థితిని ఉత్సాహంగా ఉంచుతుంది. యాంటిబయాటిక్స్ మందుల తయారీలో కాకర పూల తైలాన్ని ఉపయోగిస్తుంటారు. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

గునుగు

ఈ పువ్వులను అతిసార, క్షయ వ్యాధుల నివారణకు ఔషధంగా వాడతారు. ఈ పూల పొడి పెద్ద పేగులోని బద్దె పురుగులను తొలగించడానికి, కంటి సంబంధ రోగ నివారణకు ఉపయోగిస్తారు. మధుమేహం, నోటి పుండ్లు, ముక్కులో రక్తస్రావం తగ్గడానికి ఉపయోగిస్తారు. రక్తపోటును అదుపులో పెడుతుంది.

తంగేడు

దీని ఆకులు, పువ్వుల చూర్ణాన్ని కామెర్లు, తామర లాంటి చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు. చెక్కను ఉదరకోశ వ్యాధులకు మందుగా, కళ్లకలక నుంచి ఉపశమనం పొందడానికి ఉపయోగిస్తారు.

గడ్డిపువ్వు

గడ్డి పువ్వును ఆయుర్వేద వైద్యంలో యాంటిబయాటిక్‌గా వాడతారు. రక్తస్రావాన్ని నియంత్రించేందుకు ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, తండాల్లో, పల్లెల్లో ఈ పూలరసాన్ని ఉపయోగిస్తున్నారు.

గుమ్మడి

శరీర ఉష్ణోగ్రత సమతుల్యం ఉంచేందుకు వీటి పూలు ఆయుర్వేద వైద్యంలో వాడతారు. గుమ్మడి పువ్వు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పూలలో ఎ-విటమిన్ అధికంగా ఉండటంతో కంటి సంబంధిత రోగాలకు ఔషధంగా ఉపయోగిస్తారు. దగ్గు, జలుబు, వైరల్ జ్వరం తగ్గేందుకు వీటి పూలను మందుగా వాడతారు.

ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం

- డా.అనికేత్ వైద్య, ఆయుర్వేద వైద్య నిపుణులు



బతుకమ్మలో వాడే పూలు మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి. ఆ పూలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్యం తయారీలో వాటిని వాడతారు. మహిళలు బతుకమ్మల చుట్టూ ఆడే సందర్భంలో పూలనుంచి వచ్చే సువాసన, వాటి తాకిడితో జ్ఞానేంద్రియాలు ఉత్తేజితమవుతాయి. పూలను చూడటంతో కంటి చూపు బాగు పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ నవరాత్రులు బతుకమ్మ ఆడే క్రమంలో వారికి తెలియకుండానే కొన్ని రుగ్మతలు వాటంతటఅవే తగ్గిపోతాయి. వర్షాకాలంలో వాగులో, నదిలో కొత్త నీరు చేరుతుంది. సామూహికంగా బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడంతో హానికారక క్రిమికీటకాలు నశిస్తాయి. కొన్ని పూలు నీటిని శుద్ధి చేసి జలజీవులను బతికిస్తాయి. నైవేద్యాన్ని సమర్పించడంతో నీటిలోని జీవులకు అవి ఆహారంగా అవుతాయి.

పల్లెల అభివృద్ధి భాజపాతో సాధ్యం


మాట్లాడుతున్న ఎంపీ నగేష్

దస్తూరాబాద్, న్యూస్‌టుడే: ప్రజలంతా భాజపా వైపు చూస్తున్నారని ఎంపీ జి.నగేష్ అన్నారు. శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా దస్తూరాబాద్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్, భారాస పాలనలో విసిగిపోయారని, సభ్యత్వాలు విరివిగా చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం రేవోజిపేట గ్రామానికి చెందిన కార్యకర్త బొమ్మెన రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రితీష్, ఆకుల శ్రీనివాస్, కొడిమెల లక్ష్మణ్, వెంకటరమణ, సాగర్, రాజు, నాయకులున్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ

వసతిగృహాల్లో సిబ్బంది కొరత

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ దృష్టికి ఆర్జీయూకేటీ సమస్యలు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆర్జీయూకేటీని శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భోజనశాల నిర్వాహకులు పట్టిక పాటించడం లేదని, ఇష్టానుసారంగా భోజనం పెడుతున్నారని, గడువు ముగిసినా కొత్త నిర్వాహకులను ఏర్పాటు చేయడం లేదన్నారు. విశ్వవిద్యాలయంలో చీఫ్ వార్డెన్ శ్రీధర్ ప్రవర్తన బాగా లేదని వెంటనే మార్చాలని పలువురు విద్యార్థులు కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో 60 శాతం బాలికలున్నారని వారి వసతిగృహాల్లో కేర్ టేకర్ల(పోషకుల) కొరత ఉందన్నారు. అనంతరం పరిపాలన విభాగం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణతో కలిసి అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చీఫ్ వార్డెన్ సమావేశానికి ఆలస్యంగా రావడం, విద్యార్థులు పలు ఆరోపణలు చేయడంతో ఆయనపై కమిషన్ ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తొలగించి నూతన వార్డెన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మిగిలిన సమస్యలు పరిష్కరించకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులపై నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అందజేస్తానని చెప్పారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై గణేశ్, విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం అధికారి రణధీర్ తదితరులున్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమైన ఉమ్మడి జిల్లా బాలుర జట్టుతో విద్యాధికారి యాదయ్య తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్లు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు పయనమయ్యాయి. అండర్-17 బాలబాలికల విభాగంలో శనివారం (బాలురు), ఆదివారం (బాలికలు) నుంచి పోటీలు ప్రారంభం కానుండగా ఆయా జట్ల క్రీడాకారులకు జిల్లా విద్యాధికారి యాదయ్య క్రీడా దుస్తులు అందజేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇవీ జాగ్రత్తలు..



పోలీసులు, దర్యాప్తు సంస్థ ఏదైనా కేసు గురించి ఫోన్ ద్వారా ఆరా తీయవు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వంటి వివరాలు సేకరించవు. కేసు నమోదవ్వకుండా ఉండాలంటే డబ్బు పంపించాలని చెబితే మోసమని గుర్తించాలి. ఎవ్వరికీ పార్సిల్ పంపకున్నా ఇతర దేశాలకు మీ పేరుపై వెళ్తొందంటే నమ్మొద్దు. వివిధ దర్యాప్తు సంస్థల పేర్లతో ఫోన్లు చేస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఒకవేళ మోసపోయి డబ్బు కోల్పోతే టోల్‌ఫ్రీ 1930, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

' రెండు రోజుల క్రితం మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి దిల్లీ పోలీసుల పేర్లతో ఫోన్లు వచ్చాయి. మీ అబ్బాయిని సైబర్‌క్రైంలో అరెస్టు చేశాం. మా ఖాతాలోకి డబ్బులు జమ చేయాలంటూ చెప్పగా సదరు ఉద్యోగి తేరుకొని మా అబ్బాయి ఇంట్లోనే ఉన్నాడని సమాధానం చెప్పడంతో నిందితులు ఫోన్లు చేయడం ఆపేశారు.'

సైబర్ వల.. చిక్కితే విలవిల

● దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం అధికారులమంటూ ఫోన్లు



సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) 1930 కాల్‌సెంటర్‌లో ఫిర్యాదు చేస్తారు. అయితే ఆ కాల్‌సెంటర్, సైబర్‌క్రైం పోలీసుల పేరుతోనే మోసం జరిగితే.. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు చేస్తుందిదే. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, కస్టమ్స్ అధికారుల పేరుతో భయపెట్టి జనం డబ్బు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు కొంతకాలంగా రూటు మార్చారు. దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం విభాగం, 1930 కాల్‌సెంటర్ అధికారులమంటూ వల విసురుతున్నారు.
–న్యూస్‌టుడే, మంచిర్యాల నేరవిభాగం, మందమర్రి పట్టణం,

మోసగిస్తారిలా..
డ్రగ్స్ పార్సిల్ కేసు దర్యాప్తులో భాగంగా అనుమానాస్పద లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాలు గుర్తించామని.. అందులో మీది ఉందంటూ ఫోన్ చేస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని, కొంత డబ్బు మీ ఖాతాలో జమయ్యిందంటూ వివరాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తుకు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని, మీ పాత్ర లేనట్లు తేలితే డబ్బు తిరిగి పంపిస్తామంటూ కొంత వసూలు చేస్తున్నారు.

'మందమర్రికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌కు ఇటీవల పోలీసుల పేరుతో మాట్లాడి మీపై మనీ లాండరింగ్ కేసు ఉందని బెదిరించి విడతలవారీగా రూ. 1,43,75000 నిందితులు తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు.'


మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి వచ్చిన ఫోన్‌కాల్స్ జాబితా

జడ్జిలకు పదోన్నతులు

● మరికొందరికి స్థానచలనం

ఎదులాపురం, మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా 38 మంది జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతులు కల్పిస్తూ, మరో 32 మందికి స్థాన చలనం కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఒకరు పదోన్నతి పొంది మరో జిల్లాకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి ఇద్దరిని ఉమ్మడి జిల్లాకు బదిలీ చేశారు.

న్యాయమూర్తి	ప్రస్తుత స్థానం	బదిలీ
పదోన్నతులు పొంది బదిలీ అయిన వారు		
మంజుల సూర్యవార్	జూనియర్ సివిల్‌జడ్జి ఆదిలాబాద్	సీనియర్‌సివిల్‌జడ్జి నకిరేకల్(నల్గొండ)
డి. రామ్మోహన్‌రెడ్డి	,, ,, ములుగు	,, ,, మంచిర్యాల
సి. సంపత్	,, ,, మంచిర్యాల	,, ,, మంచిర్యాల
స్థాన చలనం అయిన వారు		
జి. శ్రీనివాస్	సీనియర్ సివిల్ జడ్జి నారాయణపేట్	సీనియర్ సివిల్ జడ్జి నిర్మల్
గవ్వల రాధిక	,, ,, నిర్మల్	డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిర్మల్
అర్పిత మారంరెడ్డి	,, ,, మంచిర్యాల	,, ,, మంచిర్యాల

గుమ్మడి కాయంత పరిమాణం.. ద్రాక్షపండు రుచి


చెట్టుకు కాసిన పనస పనస పండ్లు

పెద్ద సైజులో ఉన్న ఈ కాయలను చూసిన వారు ఇవేమని ఆశ్చర్యపోతున్నారు. ఇది గోల్డెన్ బ్లూమ్ గ్రాఫ్టెడ్ పొమెలో ఫ్రూట్ లేదా పనస పనస లేదా గజ నిమ్మ అంటారు. ఇవి ఆగ్నేయ ఆసియా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఖానాపూర్ మండలం మస్కాపూర్ మధురానగర్ కాలనీకి చెందిన శ్రవణ్ తన ఇంట్లో అయిదేళ్ల కిందట నాటిన మొక్క పెద్దదై పండ్లను ఇస్తోంది. గుమ్మడికాయ సైజులో ఈ పండ్లు కాస్తాయని, ద్రాక్షపండు రుచిని పోలి ఉంటుందని శ్రవణ్ చెప్పారు. ఈ పండులో పొటాషియం, విటమిన్-సి పుష్కలంగా ఉంటాయని నిర్మల్‌కు చెందిన వృక్ష శాస్త్ర ఉపాధ్యాయుడు మోహన్‌రావ్ తెలిపారు. -న్యూస్‌టుడే, ఖానాపూర్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

? మండలంలోని ఫాకీజానగర్ కాలనీలో మురుగు కాలువలు లేక అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. **- అబ్జల్, స్థానికుడు**

✔ కాలనీలో మురుగు కాలువల నిర్మాణాలకు అంచనాలు తయారు చేసి నివేదికలు పంపించాం. **- రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్**

న్యూస్‌టుడే, సిర్పూర్(టి)

? బెస్తవాడ కాలనీలో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉంటోంది. రోడ్డుపైకి మురుగు వచ్చి చేరుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదు. **- సురేష్, కాలనీవాసి**

✔ నాలాల నిర్మాణాల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారి ఆదేశానుసారం త్వరలోనే పరిష్కరిస్తాం.
- పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సిర్పూర్(టి)

న్యూస్‌టుడే, రెబ్బెన

? గోలేటిలోని వారసంతలోతాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గురువారం జరిగే సంతలో అందుబాటులో నీటి వసతి లేక వినియోగదారులు, వ్యాపారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వెంటనే నీటి సౌకర్యం కల్పించాలి **-గంగిశెట్టి సురేష్, గోలేటి**

✔ త్వరలోనే తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తా
- మురళీధర్, పంచాయతీ కార్యదర్శి

ఇక్కడ మొరం గుట్ట ఉండె!

చెరువుల్లో ఇసుక, మట్టి అక్రమార్కులకు వరంగా మారుతోంది. సిర్పూర్(టి) మండలంలోని డంపింగ్ యార్డు వెనకాల రైల్వేట్రాక్ వద్ద మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మండల శివారు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా జేసీబీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు పాటించకుండానే రాత్రిపూట తవ్వకాలు జరుపుతున్నారని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. రూ. లక్షల విలువైన ప్రకృతి సంపద అధికారుల అలసత్వం కారణంగా కనుమరుగు అవుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)


డంపింగ్ యార్డు వెనకాల రైల్వేట్రాక్ వద్ద మొరం తవ్వకాలు జరిపిన ప్రదేశం

ఈవీఎంల రక్షణకు పటిష్ఠ భద్రత

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. పార్లమెంటు ఎన్నికల్లో సాంకేతిక సమస్యలతో ఆగిపోయిన ఒక బ్యాలెట్ యూనిట్, 10 వీవీప్యాట్ల మరమ్మతుల కోసం ఈసీఎల్ హైదరాబాద్‌కు పంపిస్తామని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, ఎన్నికల డీటీలు శ్యాంలాల్, ఉర్మిల, రాంలాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.


ఇందాపూర్ వెళ్లే మార్గంలో ఖైరి సమీపంలో కల్వర్టు దుస్థితి


జైరాంగూడ సమీపంలో..

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!

ఏజెన్సీ మండలాల్లో రోడ్లు, వంతెనల పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. కొత్తవి మంజూరు పక్కన పెడితే ఉన్నవి ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. కెరమెరి మండలంలోని బోకడగూడ, జైరాంగూడ, ఖైరి, కేలి(కే) సమీపంలోని కల్వర్టు సుమారు నాలుగైదేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. వాహన చోదకులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ మార్గంలో వెళ్లేందుకు జంకుతున్నారు. ఇటీవల పలువురు ప్రమాదాలకు గురయ్యారు. సోమవారం బోకడగూడ సమీపంలో సరకులతో వెళ్తున్న ఓ వాహనం బోల్తా పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్వర్టులు, వంతెనలపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కెరమెరి**


ఇటీవల బోకడగూడ సమీపంలో బోల్తాపడ్డ వాహనం

గాయత్రిదేవిగా దుర్గామాత


వాసవీమాత ఆలయంలో గాయత్రిదేవి అవతారంలో..

రెబ్బెన, న్యూస్‌టుడే : ఇందిరానగర్‌లోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. రెబ్బెన తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. సింగరేణి ప్రాంతంలోని గోలేటి సీహెచ్‌పీ, ఖైరిగూర ఓసీపీలోని దుర్గామాత ఆలయాల్లో ఉద్యోగులు పూజలు చేశారు. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, సీహెచ్‌పీ భీమ్‌రావు జాడే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన అర్చకుడు దేవర వినోద్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీశారద దేవీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు నిర్వహించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి.

కాగజ్‌నగర్, తిర్యాణి : రెండో రోజు గాయత్రిదేవి అవతారంలో అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. తిర్యాణి మండలం భీమారం హనుమాన్ ఆలయంలో అర్చకుడు విజయ్‌కుమార్ మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు.


ఇందిరానగర్‌లోని అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న తహసీల్దార్ పి.రామ్మోహన్‌రావు, భక్తులు


భూగర్భంలోని మహంకాళి అమ్మవారికి మంగళహారతులు ఇస్తున్న మహిళలు


కౌటాలలోని శారదాదేవి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..


మార్కెట్ ఏరియాలో నవయుగ దుర్గా మండపంలో..

బతుకమ్మ వేడుకలు


వాసవీమాత ఆలయంలో.. మహిళల కోలాటాలు


పెంచికల్‌పేట్‌లో..

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు జరుపుకొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ పేర్చి కళాశాల ప్రాంగణంలో ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని పేర్కొన్నారు. పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

పెంచికల్‌పేట్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ గౌరుబాయి, ఆయాలు సాలమ్మ, సుశీలలు పదవీ విరమణ పొందగా వారిని శాలువాతో సత్కరించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, డీటీ సరిత, ఆర్ఐ సురేష్, సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్ ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

వేతనాలు చెల్లించకుంటే డీఎఫ్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

రెబ్బెన, న్యూస్‌టుడే: రెబ్బెన ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రెబ్బెన ఎఫ్ఆర్వో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ రాజేందర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులు కుటుంబాన్ని పోషించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. దసరా, బతుకమ్మ పండగ సందర్భంగా పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ నెల 7వ తేదీ లోపు చెల్లించకపోతే డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు ప్రతి నెలా 5వ తేదీ లోపు చెల్లించాలని, రోజూ కూలీ రూ. 600 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నర్సరీ కార్మికులు దశరథం, బాపురావు, మారుతి, సంతోష్, కౌసల్య, సంఘమిత్ర, సరిత, స్వరూప, శంకరమ్మ పాల్గొన్నారు.

విస్తృతంగా స్వచ్ఛత కార్యక్రమాలు


చీపురు పట్టి చెత్త ఊడ్చుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, తదితరులు

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: వ్యర్థాల నుంచి ఉపయోగకర వస్తువులు రూపొందించేలా ప్రతి ఒక్కరి ఆలోచన ఉండాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని వారసంతలో స్వచ్ఛత పక్వాడా (స్పెషల్ క్యాంపెయిన్ 4.0) కార్యక్రమాన్ని నిర్వహించారు. జీఎం, అధికారులు, గుర్తింపు సంఘం నాయకులతో కలిసి చెత్తాచెదారాన్ని చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. బెల్లంపల్లి ఏరియాలో స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 30వ తేదీ వరకు గుర్తించిన పనులను ఈ నెల 2-31 తేదీ వరకు పనులను అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యాలయాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. బెల్లంపల్లి ఏరియాకు స్వచ్ఛతలో మొదటి స్థానం వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని పేర్కొన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్. తిరుపతి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ ఎస్కే మదీనా భాషా, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఒకరి బలవన్మరణం


వడ్లూరి సురేష్

వాంకిడి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండలంలోని ఖిరిడిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిరిడి గ్రామానికి చెందిన వడ్లూరి సురేష్(40) గురువారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య వనిత, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జూద స్థావరంపై దాడి

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో జూద స్థావరంపై శుక్రవారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అయిదుగురు జూదం ఆడుతుండగా వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు కౌటాల సీఐ ముత్యం రమేష్, ఎస్సై కొమురయ్య తెలిపారు. వారి నుంచి రూ. 9,140 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు చరవాణులు స్వాధీన పరుచుకున్నారు.

11 మంది బైండోవర్

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ పరిధిలో జూదం ఆడుతూ పట్టుబడిన 11 మందిని శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.2 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

భగీరథ నీరు రావడం లేదని నిరసన

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని బీబ్రా గ్రామ ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. దహెగాం-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఎంపీడీవో వచ్చి పరిశీలించారని అయినా పరిష్కారం కాలేదని వాపోయారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుమలతను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. పైపులైన్ సమస్యతో నీరు రావడం లేదని, మరమ్మతులు చేశామని పేర్కొన్నారు.

ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

కౌటాల, న్యూస్‌టుడే : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన శారదాదేవి మండపాల వద్ద నిర్వాహకులు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కౌటాల ఎస్సై మధుకర్ సూచించారు. శుక్రవారం కౌటాల పోలీస్‌స్టేషన్‌లో మండపాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. మండపాల వద్ద రాత్రివేళల్లో తప్పనిసరిగా సభ్యులు ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా నిమజ్జన సమయంలో డీజే మోతలు ఉండొద్దని స్పష్టం చేశారు. సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఆకస్మిక తనిఖీ.. ఆదేశాలు జారీ


వంటగదిలో సాంబారు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, భోజనశాలను పరిశీలించారు. వైద్యుల గదులు, రోగుల వార్డుల్లో పరిశీలించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే జనరేటర్ ఆన్ చేసి రోగులకు ఇబ్బంది లేకుండా విద్యుత్తు వసతి కల్పించాలని ఆదేశించారు. రోగులకు అందించే భోజనం మెనూ ప్రకారం అమలు చేయాలని, తాజా కూరగాయలు, సరకులను వాడాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళ శక్తి క్యాంటిన్‌ను పరిశీలించారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం

ప్రభుత్వ ఆసుపత్రి భవనంపై అదనపు గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ సిబ్బంది చెత్తాచెదారాన్ని ఆసుపత్రి ఆవరణలోనే పడేయడంతో అపరిశుభ్రంగా మారింది. నీరు నిలిచి పారిశుద్ధ్యం లోపించింది. గమనించిన అదనపు కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇలా పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. రూ.పది వేల జరిమానా వేయాలని పుర అధికారులను ఆదేశించడంతో.. గుత్తేదారు సంస్థకు జరిమానా విధించారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో భాజపా సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని జెండగూడ సమీపంలో కొత్తగా నిర్మించిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల మన్‌కీ బాత్ కార్యక్రమ సన్నాహక, సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభ్యత్వ నమోదును ప్రతి బూత్‌స్థాయి నాయకులు బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని మించి సభ్యత్వం చేసి జిల్లాను ముందు వరుసలో ఉంచాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దోని శ్రీశైలం, చెర్ల మురళీధర్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యుడు ముజేందర్, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికల జిల్లా ఇన్‌ఛార్జి అన్నపూర్ణ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌ఛార్జి వీరభద్రాచారి, అశోక్ ముస్తాపూర్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

దహెగాం, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో వారం రోజులుగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం రైతువేదికలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. మండలంలోని కూలీలు హాజరుకావాలని సూచించారు.

పకడ్బందీగా వివరాల నమోదు


సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో పుర కమిషన్ భుజంగ్‌రావు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ మూడో వార్డులో నిర్వహిస్తున్న సర్వేను, నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఇంటి యజమానురాలిగా మహిళ పేరు నమోదు చేశాక కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. అనంతరం కుటుంబం గ్రూప్ ఫొటో తీసుకోవాలని సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలని, జాబితాలో లేని వారి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ఉమ్మడి కుటుంబం వివాహం జరిగి వేరుగా నివాసం ఉంటే వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. గడువు లోపు సర్వే పూర్తి చేసి ఈ నెల 9న వివరాలను పరిశీలించి నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపర్చి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒక కార్డు ఉంటుందని, కుటుంబంలోని ప్రతి సభ్యునికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అన్నింటికీ ఒకే కార్డు అనుసంధానమై ఉంటుందన్నారు. కార్యక్రమంలో పుర కమిషనర్ భుజంగ్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వేలో పారదర్శకత తప్పనిసరి


ద్వారకానగర్‌లో.. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో అధికారులు పారదర్శకత పాటించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల ఆదేశించారు. పట్టణంలోని 14వ వార్డులో 300 కుటుంబాలు ఉండగా తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ రమేష్, కమిషనర్ అంజయ్యలు మూడు బృందాలుగా ఏర్పడి శుక్రవారం సర్వే నిర్వహించగా.. ఆమె పరిశీలించారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు ప్రత్యేక నమూనాలో నమోదు చేయాలని సూచించారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు కాలనీలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. గుంటూరు కాలనీ, పెట్రోల్‌పంప్ ఏరియా, సర్‌సిల్క్ కాలనీల్లోని విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేపట్టనున్నందున అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జనరల్ మజ్దూర్ పోస్టుల్లో అవకాశం కల్పించరూ..

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల భర్తీలో బెల్లంపల్లి ఏరియాకు చెందిన వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ.. శుక్రవారం జీఎం శ్రీనివాస్‌కు పలువురు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. రెబ్బెన, తిర్యాణి, ఆసిఫాబాద్, గోలేటికి చెందిన తమ తల్లిదండ్రులు గతంలో సింగరేణిలో వివిధ డిపార్టుమెంట్లలో పనిచేసి మెడికల్ అన్‌ఫిట్ అయినట్లు తెలిపారు. వారసత్వంగా తాము ఉద్యోగంలో చేరామని, ఇక్కడి ఏరియాలో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం ఇచ్చినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండటంతో వారి యోగక్షేమాలు చూసుకోలేకపోతున్నట్లు వాపోయారు. స్థానికంగా ఉంటున్న తమకు ప్రస్తుత నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించాలని విన్నవించారు.

కుమురం భీం వర్ధంతి గోడప్రతుల ఆవిష్కరణ

కెరమెరి, న్యూస్‌టుడే : పోరాటయోధుడు కుమురం భీం వర్ధంతికి సంబంధించి గోడప్రతులను భీం మనవడు సోనేరావ్, భీం ఉత్సవ కమిటీ ఛైర్మన్ పెందుర్ రాజేశ్వర్ జోడేఘాట్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.


జోడేఘాట్‌లో ఆవిష్కరిస్తున్న భీం మనవడు సోనేరావ్, నాయకులు

పండగ పూట పస్తులేనా?

నాలుగు నెలలుగా సీఆర్టీల వేతన వెతలు!

న్యూస్‌టుడే, కెరమెరి

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్టీల (కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్)కు వేతన కష్టాలు తప్పడం లేదు. నాలుగు నెలలు తరబడి జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దసరా పండగ నేపథ్యంలో పస్తులుండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 123 ఆశ్రమ పాఠశాలలు, 904 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 1,190 మంది సీఆర్టీలు విధులు నిర్వహిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం వీరి పనితీరును మెచ్చుకుంటున్నా.. వేతనాలు విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.


బోధిస్తున్న సీఆర్‌టీ

ఉమ్మడి జిల్లాలో..

ఐటీడీఏ	1
ఆశ్రమ పాఠశాలలు	123
గిరిజన ప్రాథమిక పాఠశాలలు	904
మొత్తం సీఆర్టీలు	1,190


అప్పులు చేయాల్సిన దుస్థితి..

గత సర్కారు హయాంలో వేతన కష్టాలు పడ్డామని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నెల నెలా వేతనాలు వస్తాయని ఆశించినా.. భంగపాటు తప్పడం లేదని సీఆర్టీలు వాపోతున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు జీతాలు లేకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. దానికి తోడు ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టిన తర్వాత ఖాళీ అయిన స్థానాల్లో సీఆర్టీలకు కూడా బదిలీలు, సర్దుబాటు చేపట్టారు. దీంతో ఎక్కడో దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. నాలుగు మాసాలుగా వేతనాలు లేకపోవడంతో కనీసం రోజువారీ విధులకు వెళ్లడానికి ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. కుటుంబ పోషణ, పిల్లల విద్యాభ్యాసం, తదితరాలు కష్టంగా మారిందంటున్నారు.

బడ్జెట్ సర్దుబాటుతో కష్టాలు..?

రాష్ట్రంలోని ఆయా ఐటీడీఏ పరిధిలో మొత్తం 2,102 సీఆర్టీలు పనిచేస్తున్నారు. గత ఏడాది వరకు 1,804 మందికి మాత్రమే ఆర్థిక శాఖ ద్వారా అనుమతి ఉంది. 2023-24లో బోధన అవసరం మేరకు 298 మందిని అదనంగా నియమించారు. వీరికి ఆర్థికశాఖ నుంచి అనుమతి రాలేదు. అనుమతి ఉన్న వారికి మాత్రమే నిధులు విడుదల చేస్తోంది. ఫలితంగా ఆ బడ్జెట్‌తోనే అందరికీ సర్దుబాటు చేయడంతో వేతన ఇబ్బందులు తప్పడం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులు చొరవ చూపాలి



జూన్ నుంచి ఇప్పటి వరకు సీఆర్టీలకు వేతనాలు లేవు. ఏటా ఇదే పరిస్థితి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా చూస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రతిసారి బడ్జెట్ పేరుతో మూడు లేదా నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు వేస్తుండటంతో ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. పండగ పూటనైనా ఉన్నతాధికారులు చొరవ చూపి రెండు లేదా మూడు రోజుల్లో వేతనాలు విడుదలయ్యేలా చొరవచూపాలి. **- కొమరెల్లి శంకర్, సీఆర్టీల జిల్లా అధ్యక్షుడు**